
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
శుక్రవారం 5 జూలై 2024



మల్లన్నసాగర్ పర్యాటక కేంద్రం..
అడియాసేనా?
- టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతామని గత ప్రభుత్వం హామీ
- రూ.1500 కోట్లతో పనులు చేస్తామని ప్రకటన
- నెరవేరని హామీ... ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకునేనా?

7

స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్, జూలై 4 : బడుగు, బలహీనవర్గాలకు స్ఫూర్తి ప్రదాత, పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య అని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లోని ఆరెపల్లి, అంబేడ్కర్ చౌరస్తాల్లో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పు కణిక దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. అనేక సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయని నిరూపించిన వ్యక్తి అని తెలిపారు. యువత దొడ్డి కొమురయ్య స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, బస్వారాజు సారయ్య, నాయకులు బంక చందు, ఎగ్గిడి అయిలయ్య, గంపల శ్రీనివాస్, సది తదితరులున్నారు.

మంత్రిని కలిసిన యూనిసెఫ్ ప్రతినిధుల బృందం

హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రభాకర్‌ను యూనిసెఫ్ బృంద ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి పొన్నం శాలువాలతో సన్మానించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులకు వారు కల్పిస్తున్న అవగాహన అంశాలపై మంత్రికి వివరించారు.

బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంపై హర్షం

బాసర ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో మొత్తం 1404 సీట్లకు 330 సీట్లు జిల్లా విద్యార్థులు సాధించడం అభినందనీయమన్నారు. అత్యధిక సీట్లు సాధించి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

పొట్లపల్లి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. అలాగే పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో అర్చనలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. మంత్రికి ఆలయ ఈవో అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు.



పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నేడు అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

హాజరుకానున్న మూడు జిల్లాల కలెక్టర్లు

హుస్నాబాద్, జూలై 4 : హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనంలో నియోజకవర్గ అభివృద్ధి పనులపై శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న హన్మకొండ, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.



హుస్నాబాద్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్




అధికారుల చేతుల్లో..

- ఇప్పటికే గ్రామాలు.. ఇకపైన మండలాలు
- ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు
- ఎన్నికలు పూర్తయ్యేదాకా వీరిదే ఆధిపత్యం
- ప్రత్యేక దృష్టిసారిస్తేనే ప్రయోజనం
- గ్రామాల్లో స్పెషలాఫీసర్లపై విమర్శల వెల్లువ

ఆంధ్రజ్యోతిప్రతినిధి, సిద్దిపేట, జూలై4: గ్రామాలు, మండలాల పరిపాలన వ్యవహారాలన్నీ అధికారుల చేతుల్లోకి వచ్చాయి. ఆర్నెళ్ల క్రితం గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు పూర్తికావడంతో మండలస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. తాజాగా స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో జిల్లాస్థాయి అధికారులకు మండలాల బాధ్యత అప్పగించారు. అయితే గ్రామాలను పర్యవేక్షిస్తున్న అధికారులపై ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. మండల ప్రత్యేకాధికారులైనా బాధ్యతగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా కీలకమయ్యారు. నిన్నటితో వారి పదవీకాలం ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామపంచాయతీలతోపాటు స్థానిక సంస్థలు సైతం అధికారుల పాలనల్లోకి వెళ్లాయి. సంగారెడ్డి జిల్లాలోని 647 గ్రామపంచాయతీలు, 28 మండలాలు, సిద్దిపేట జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, 26 మండలాలు, మెదక్ జిల్లాలోని 467 గ్రామపంచాయతీలు, 20 మండలాల పరిపాలన కార్యకలాపాలన్నీ ఇక నుంచి అధికారులే పర్యవేక్షించనున్నారు.

బాధ్యతలను భారంగా..

ప్రస్తుతం మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. అయితే ఆర్నెళ్ల క్రితమే గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారుల్లో కొందరు తమ బాధ్యతలను భారంగా మోస్తున్నారు. అదనపు బాధ్యతలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేకపోవడంతో ఆ బాధ్యతలను ప్రత్యేకాధికారులే నిర్వర్తించాల్సి ఉంది. కానీ కొందరు అధికారులు తమదైన ముద్రవేస్తుండగా చాలామంది గ్రామాల పరిపాలనతోపాటు అభివృద్ధి, సంక్షేమాలను విస్మరిస్తున్నారు. కనీస వసతులను కల్పించడంలో విఫలమవుతూ స్థానికంగా విమర్శలను ఎదుర్కొంటున్నారు. చుట్టపుచూపుగా గ్రామాలను సందర్శిస్తూ సంతకాలకు పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తమ మాతృశాఖల్లో ఉన్న పనులతోనే సమయం గడిచిపోతుందని, దీనికితోడు గ్రామాల బాధ్యతలను పర్యవేక్షించడం భారంగా మారిందనే నిరుత్సాహన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నియామకమైన మండల ప్రత్యేకాధికారులతో కొత్తదనం చేకూరుతుందనే అంచనాలున్నాయి. మండల ఇన్‌చార్జులంతా జిల్లా స్థాయి అధికారులే కావడంతో గ్రామాల స్పెషలాఫీసర్లను గాడిన పెట్టే అవకాశాలు లేకపోలేదు.



సిద్దిపేట జిల్లాలోని 23 మండలాల ప్రత్యేక అధికారులు		
మండలం	అధికారి	హోదా
1 సిద్దిపేటఅర్బన్	పద్మ	ఏడీ అగ్రికల్చర్, సిద్దిపేట
2 సిద్దిపేటరూరల్	శ్రీనివాస్	డీఎఫ్‌వో
3 నారాయణరావుపేట	శ్రీనివాస్‌రెడ్డి	డీఈవో
4 నంగునూరు	దేవకీదేవి	డీపీవో
5 చిన్నకోడూరు	జయదేవ్‌ఆర్య	డీఆర్డీఏ పీడీ
6 దుబ్బాక	తనూజ	డీఎస్‌వో
7 తొగుట	శ్రీరాంరెడ్డి	ఈడీ ఎస్సీ కార్పొరేషన్
8 మిరుదొడ్డి	గణేష్	జీఎం ఇండస్ట్రీస్, గజ్వేల్
9 దౌల్తాబాద్	లింగస్వామి	ఏడీ మైన్స్
10 రాయపోల్	బాబునాయక్	ఏడీ అగ్రికల్చర్, గజ్వేల్
11 గజ్వేల్	సువర్ణ	డీహెచ్‌వో
12 జగదేవ్‌పూర్	వినయ్‌కుమార్	ఏడీ సర్వే, ల్యాండ్ రికార్డ్స్
13 కొండపాక	నాగేందర్	డీవైఎస్‌వో
14 ములుగు	అనిల్ కుమార్	ఏడీ అగ్రికల్చర్, ములుగు
15 మర్కూక్	బాలకృష్ణ	అడిషనల్ డీఆర్డీఏ
16 వర్గల్	కవిత	ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్
17 హుస్నాబాద్	జగత్‌కుమార్‌రెడ్డి	జిల్లా పశుసంవర్ధక శాఖ
18 అక్కన్నపేట	మహేశ్	డీఏవో
19 కోహెడ	హరీశ్	డీఎం సివిల్ సప్లయ్
20 బెజ్జంకి	మల్లేశం	డీఎఫ్‌వో (ఫిషరీ)
21 చేర్యాల	సీతారాం	ఏడీ గ్రౌండ్‌వాటర్
22 కొమురవెల్లి	సరోజ	బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్
23 మద్దూరు	రాధిక	ఏడీ అగ్రికల్చర్, చేర్యాల

మరో ఆర్నెళ్లు అధికారులేనా..!

ఫిబ్రవరిలో గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగియగా అప్పటి నుంచి ప్రత్యేకాధికారులే కొనసాగుతున్నారు. వాస్తవానికి గత జనవరిలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. కానీ రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో అసమానతలు ఉన్నందున ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తున్నారు. కులాల గణన తర్వాతనే ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలను సైతం జూన్‌లో నిర్వహించాల్సి ఉండగా రిజర్వేషన్ల సమస్య ఉండడంతో ఇవి కూడా వాయిదా పడ్డాయి. అందుకే మండలాలకూ ప్రత్యేకాధికారులను నియమించారు. మరికొద్ది రోజుల్లో కులాల గణన చేపట్టినా అది ముగియాలంటే కనీసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని అంచనా. ఈ లెక్కన ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రజాప్రతినిధులు అడుగుపెట్టాలంటే మరో ఆర్నెళ్లు ఆగాల్సిందేనన్న చర్చ జరుగుతోంది.

నిమ్జ్ ప్రాజెక్టుకు సాగు భూములు ఇవ్వలేం

ఝరాసంగం, జూలై 4: సాగు భూములు 'నిమ్జ్'కు ఇవ్వబోమని బర్దీపూర్, ఎల్గోయి గ్రామాలకు చెందిన రైతులు గురువారం తహసీల్దార్ సంజీవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్జ్ కోసం రెండో విడత భూసేకరణ చేపట్టే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఇప్పటికే భూములు కోల్పోయిన రైతు కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని తీసుకుంటే తాము గ్రామాలను వదిలి వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి భూసేకరణను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్, రైతులు నందకుమార్, సాబేర్, గుండప్ప, వేణు, అంజద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కర్రలే స్తంభాలు..

అల్లాదుర్గం : రోజుకో ప్రమాదం జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు కళ్లు తెరవడం లేదు. అల్లాదుర్గం మండలంలోని రాంపూర్-కాయిదంపల్లి శివారులోని ఈదునేరి పెంటయ్య వ్యవసాయ క్షేత్రంలో కొన్నేళ్లుగా విద్యుత్ తీగలు నేలను తాకే విధంగా వేలాడుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైటెన్షన్ వైర్లు కిందపడకుండా కర్రలను ఆధారంగా ఏర్పాటు చేశారు. కానీవర్షాకాలం సీజన్ కావడంతో ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉందని, అధికారులు స్పందించి స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లకు..?

- డీఎస్‌సీ 2003 ద్వారా ఏఎన్‌ఎంల నియామకం
- యూరోపియన్ స్కీం నుంచి క్రమబద్ధీకరించాలని జిల్లాలో 34 మంది ఈసీ ఏఎన్‌ఎంల పోరుబాట
- చాలీచాలని జీతాలతో సతమతమవుతున్న ఈసీ ఏఎన్‌ఎంలు
- 4 నెలలుగా అందని వేతనాలు
- డిమాండ్లు పరిష్కరించాలంటూ కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు వినతి



తమ సమస్యలు పరిష్కరించాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, ఏఎన్‌ఎంలు (ఫైల్)

సిద్దిపేట టౌన్, జూలై4: 21 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతూ, చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న తమను క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) చేయాల్సిందేనని ఈసీ(యూరోపియన్‌స్కీం)ఏఎన్‌ఎంలు పోరుబాట పడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్‌సీ) ద్వారా 2003లో ఏఎన్‌ఎంలుగా రూ. 3,550 వేతనంతో విధులు చేరారు. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాక్రమాల్లో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో 34 మంది ఈసీ ఏఎన్‌ఎంలుగా కొనసాగుతున్నారు.

పారా మెడికల్ ఉద్యోగాల భర్తీలో భాగంగా

ఉమ్మడి రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో పారా మెడికల్ ఉద్యోగాల భర్తీలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాగా ఉన్నప్పుడు 2003లో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్‌సీ) ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. అందులో పాసైన వారికి అదే ఏడాది మెరిట్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ సెంటర్లలో ఏఎన్‌ఎంలుగా నియమిస్తూ పత్రాలను అందజేశారు. 2007-2008లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు కొంతమంది ఏఎన్‌ఎంలను రెగ్యూలరైజ్ చేశారు. అనంతరం కొంతమందిని నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా యూరోపియన్ కమిషన్ స్కీం (కేంద్ర ప్రభుత్వ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం)కు బదిలీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ మరికొంతమందిని రెగ్యూలరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



నారాయణరావుపేట పీహెచ్‌సీలోని సబ్‌సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

యూరోపియన్ కమిషన్ స్కీం నుంచి..

సిద్దిపేట జిల్లాలో ఈసీ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వర్తిస్తున్న 34 మందిని యూరోపియన్ కమిషన్ స్కీం నుంచి రెగ్యూలరైజ్ చేయాలంటూ ఏఎన్‌ఎంలు, తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవలే సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, డీఎంఅండ్‌హెచ్‌వో పల్ల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రెగ్యూలరైజ్ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లభించడంతో పాటు మరిన్ని, వసతులు, సౌకర్యాలు మంచి వేతనం లభిస్తుంది.

డిమాండ్లు..

- ఈసీ ఏఎన్‌ఎంలను రెగ్యూలరైజ్ చేసి, వేతనాలను అందించాలి.
- ఏఎన్‌ఎంలకు పనిభారం తగ్గించాలి.
- గర్భిణులకు, చిన్నారులకు అందించే వైద్య సేవలపై ఆన్‌లైన్‌లో కాకుండా రికార్డు బుక్‌లో నమోదు చేయాలి. ఆన్‌లైన్ చేయడం వల్ల 50 ఏళ్లు పైబడిన వారికి చూపు మందగిస్తున్నది. వారికి ఆన్‌లైన్ నుంచి ఉపశమనం కలిగించాలి.
- ఏఎన్‌ఎంల డిమాండ్లు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

నాలుగు నెలలుగా వేతనాల కోసం..

సిద్దిపేట జిల్లాలో నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఈసీఏఎన్‌ఎంలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2003లో రూ.3,550, 2008లో రూ. 5,200, 2010లో రూ.10,200, 2018లో రూ. 21,000, 2022లో రూ.27,000 చొప్పున వేతనాలు అందిస్తున్నారు. అయితే నాలుగునెలలుగా వేతనాలు రాకపోడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే విడుదల చేయాలని వాడు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


- ఎల్లవ్వ, పీహెచ్‌సీ నారాయణరావుపేట



21 ఏళ్లుగా ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. చాలా ఏళ్ల నుంచి ఎన్నో సమస్యలు, ఒడిదుడుకులు ఎదురైనా వాటిని తట్టుకొని ప్రభుత్వాలకు సహకరించాం. పనిభారం ఉన్నప్పటికీ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా మా సేవల్ని గుర్తించి రెగ్యులరైజ్ చేయాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలి

- కాల్వ చక్రధర్, యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు



రెగ్యులర్ కాంట్రాక్టు సర్వీసు నుంచి ఈసీ (యూరోపియన్ కమిషన్) ఏఎన్‌ఎంలుగా మారడం వల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారు. వారి సేవలకు కూడా గుర్తింపు లభించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 330 మంది ఈసీఏఎన్‌ఎంలను కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద మనసుతో క్రమబద్ధీకరించాలి.



సీఎం రేవంత్‌రెడ్డితో చాడ వెంకటరెడ్డి

గౌరవెల్లి కెనాల్ పనులను త్వరగా పూర్తిచేయాలి

- సీఎంను కోరిన సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూలై 4: శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్ కెనాల్ నిర్మాణ పనులకు సరిపడా నిధులు మంజూరు చేసి త్వరగా పూర్తిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేస్తామని చెప్పినా నేటికీ అమలు కాలేదని ఇదే విషయాన్ని సీఎంకు వివరించామన్నారు. ఇప్పటికీ రిజర్వాయర్ ముంపు బాధితులకు పూర్తి పరిహారం రాలేదన్నారు. కరువు ప్రాంతమైన హుస్నాబాద్‌కు గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్‌లో వచ్చే వర్షాకాలం నాటికైనా నీటిని నిల్వ చేసుకోవడానికి అలాగే అన్ని ప్రాంతాల్లో కెనాల్స్‌కు భూసేకరణ, నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తికావడానికి తక్షణమే సరిపడా నిధులను మంజూరు చేయాలని కోరినట్లు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

శునకాలకు పోస్టుమార్టం

దుబ్బాక, జూలై 4: దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేట వార్డులో శునకాలను హతమార్చిన సంఘటనలో కేసు నమోదు చేసినట్టు దుబ్బాక ఎస్‌ఐ గంగారాజు తెలిపారు. పూడ్చిన కుక్కల మృతదేహాలను బయటకు తీసి, జిల్లా పశువైద్యా సంచాలకులు బాలసుందరం ఆధ్వర్యంలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. శునకాల అవశేషాల నుంచి సేకరించిన నమూనాలను హైదరాబాద్‌లోని జంతుపరిశోధనశాలకు పంపించారు. శునకాల మరణాలకు గల కారణాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. జంతుసంరక్షణ సమితి ప్రతినిధి గౌతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆయన వెంట దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ కూడా ఉన్నారు



పూడ్చివేసిన శునకాల మృతదేహాలను తీసి పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారులు

టిప్పర్ ఢీకొని రైతు మృతి

గుమ్మడిదల, జూలై 4 : టిప్పర్‌ను అతివేగంగా నడుపుతూ రోడ్డుపై నిలుచున్న రైతును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గుమ్మడిదల గ్రామంలో గురువారం చేసుకున్నది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన రైతు సరెరెడ్డి గారి పాటక్ సంజీవరెడ్డి(60) ఉదయం పొలం పనులకు వెళ్లి స్కూటీపై తిరిగి వస్తుండగా మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారి చిన్నపరెడ్డి పాత రైస్‌మిల్ సమీపంలోని ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజ్ పోవడంతో రోడ్డుకు దూరంగా స్కూటీని ఆపి పరిశీలిస్తున్నాడు. నర్సాపూర్ వైపు నుంచి గండిమైసమ్మకు మట్టి లోడ్‌తో వేగంగా వచ్చిన టిప్పర్ అదుపుతప్పి సంజీవరెడ్డిని బలంగా ఢీకొన్నది. దీంతో ఎగిరి దూరంగా పడిన సంజీవరెడ్డి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సంజీవరెడ్డి సీపీఐ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహచరుడిగా ఉంటూ అనేక పోరాటాలు చేశాడు. సీపీఐ జిల్లాస్థాయి నాయకుడిగా, రైతు సంఘం నేతగా రైతుల కోసం పోరాటం చేశాడు. సంజీవరెడ్డి మరణ వార్త తెలుసుకుని పలువురు నాయకులు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంజీవరెడ్డి కుమారుడు కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.


సంజీవరెడ్డి(ఫైల్)

దంపతుల మధ్య గొడవ
మనస్తాపంతో భర్త ఆత్మహత్య


బోయిని యాదగిరి(ఫైల్)

కొల్చారం, జూలై 4: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిల్ఎచెడ్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్ గ్రామానికి చెందిన బోయిని యాదగిరి(28)కి టేక్మాల్ మండలం ధన్నారం గ్రామానికి చెందిన మానసతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. కొన్నిరోజులుగా కుటుంబ సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతున్నది. దీంతో మనస్తాపానికి గురైన యాదగిరి బుధవారం రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఉదయం వరకు రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు గాలించగా.. పల్లెగడ్డ తండా సమీపంలో ఎనగండ్ల శివారులో ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. యాదగిరి ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు.

దైవదర్శనానికి వచ్చి.. మహిళ హఠాన్మరణం

వర్గల్, జులై 4 : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం వద్ద ఓ మహిళ హఠాన్మరణం చెందిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, భాగ్యలక్ష్మీ కాలనిలో నివాసముంటున్న గళిగం బాలకిష్టమ్మ(54), కొడుకు సర్వేష్‌తో కలిసి ఇంటి పక్కనే నివాసముంటున్న కన్నెబోయిన నరసింహారెడ్డి, సుజాత దంపతులలతో కలిసి బుధవారం మధ్యాహ్నం ఆటోలో దైవదర్శనం చేసుకోవడం కోసం నాచారం గుట్టకు వచ్చారు. నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని మండపం సమీపంలోని సత్రం వరండాలో బస ఏర్పాటు చేసుకున్నారు. వారంతా రాత్రి భోజనం చేసి నిద్రింస్తుండగా 12.00 గంటల సమయంలో గళిగం బాలకిష్టమ్మ అకస్మాత్తుగా వాంతులు చేసుకోగా తల్లికొడుకు గొడవపడ్డారు. ఉదయం బాలకిష్టమ్మ నిద్రలోంచి లేవకపోవడంతో 108కి సమాచారం అందిండంతో అక్కడికి చేరుకున్న వైద్య సిబ్బంది బాలకిష్టమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతురాలి కొడుకు సర్వేష్ 100 నంబర్‌కు కాల్ చేయడంతో గౌరారం పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని విచారించారు. మృతురాలి కూతురు ముధియర్ సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుర్తివాడలో ఓ ఇంట్లో చోరీ

పాపన్నపేట, జూలై 4 : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డాడు. ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన ముప్పారం గంగయ్య ఈనెల 2న ఊరికి వెళ్లి బుధవారం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా చేసి, రూ.2 లక్షల నగదు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారని గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన
యువకుడి మృతి

తూప్రాన్, జూలై 4: అప్పులబాధతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వ్యక్తి గురువారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన పానగంటి గంగమ్మకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పానగంటి రమేష్(26) జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం చాలా మంది వద్ద అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక, జీవితంపై విరక్తి చెంది పది రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. ఈ విషయాన్ని తల్లి గంగమ్మకు చెప్పగా తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.


రమేష్ మృతదేహం

చికిత్స పొందుతూ ల్యాబ్ టెక్నీషియన్ మృతి


మహేశ్(ఫైల్)

చిన్నకోడూరు, జూలై 4 : పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో గురువారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నెమలి భాగ్యలక్ష్మి, కిష్టయ్య దంపతుల కుమారుడు మహేశ్ (31) సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మహేశ్ ఏడాది క్రతమే వివహామైంది. తనకు వచ్చే జీతం డబ్బు సరిపోవడం లేదని మహేశ్ తన భార్య నిహారికకు చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో కుటుంబపోషణకు అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గంలేక జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. చేపల కోసం చెరువులో వలలు వేసి ఇంటికి తిరిగి వస్తున్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి వ్యవసాయ బావి వద్ద మహేశ్ అపస్మారక స్థితిలో కనిపించాడు. అతడు వెంటనే మహేశ్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు మహేశ్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహేశ్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మహేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ
జీహెచ్‌ఎంసీ కార్మికుడి మృతి

చిన్నశంకరంపేట, జూలై 4 : చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన చిన్న శంకరంపేట మండలంలోని ధర్పల్లిలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాఘవుల నర్సింహులు(41) హైదరాబాద్ జీహెచ్ఎంసీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నూతన ఇల్లు నిర్మించాడు. ఇంటికి నిర్మాణం కోసం తెచ్చిన అప్పు భారం కావడంతో, దిక్కు తోచని స్థితిలో మూడు రోజుల క్రితం గ్రామంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు నర్సింహులును చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్సింహులు పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. నర్సింహులు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


నర్సింహులు మృతదేహం

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

గుమ్మడిదల, జూలై 4 : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందిన సంఘటన గురువారం గుమ్మడిదల మండలం నాగిరెడ్డి గూడెంలో చోటుచేసుకున్నది. వివరాలు వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు భిక్షపతి ఉదయం తన రెండు గేదెలను మేత కోసం పోలం వద్దకు తీసుకెళ్లాడు. సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చుట్టూ కంచ లేకపోవడంతో మేత మేసుకుంటూ అక్కడికి వెళ్లడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జీవనాధారంగా ఉంటున్న రెండు గేదెలు ఒకసారి మృతి చెందడంతో కన్నీటి పర్వతమయ్యారు. రూ 1.50 లక్షల వరకు నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని భిక్షపతి మొరపెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నివేదికను రూపొందించారు. ఈ మేరకు వెటర్నరీ సిబ్బంది పంచనామా చేసినట్టు తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెల మృతదేహాలు

ఇరుకు గదుల్లో ఎన్నాళ్లు ఇలా..

- నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక తిప్పలు
- అసౌకర్యాల మధ్య నీటి పారుదల శాఖ అతిథి గృహంలో కొనసాగింపు
- పాత ఎమ్మార్వో ఆఫీస్ స్థలం సమీకృత మార్కెట్‌కు కేటాయింపు

నర్సాపూర్, జూలై 4: నర్సాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక ఇరుకు గదుల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో 13 ఏళ్ల క్రితం ఆ భవనాన్ని కూల్చివేశారు. కొత్త భవనం నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణం మొదలు పెట్టారు. అయితే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటంతో దానికి కేటాయించిన నిధులు రద్దయ్యాయి. కొన్నాళ్లు స్థానికంగా ఓ అద్దె భవనంలో కొనసాగింది. ఆరేళ్లుగా నీటి పారుదల శాఖ అతిథి గృహంలోకి మార్చారు. ఇరుకు గదుల్లో, అరకొర సౌకర్యాల మధ్య కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అయితే, పాత తహసీల్దార్ కార్యాలయం స్థలాన్ని సమీకృత మార్కెట్ కోసం కేటాయించడం విడ్డూరం. దీంతో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం లేకుండా పోయింది. ప్రస్తుతం అక్కడ సమీకృత మార్కెట్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. అందరికీ స్థలాలు చూపే మండల రెవెన్యూ కార్యాలయానికి మాత్రం సొంత స్థలం లేకుండా పోయింది.


నీటిపారుదల శాఖ అతిథిగృహంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం


ఒకే గదిలో డీటీతో పాటు సూపరింటెండెంట్, ఇద్దరు ఆర్ఐలు

మూడు గదుల్లోనే..

ఆరేళ్లుగా నీటిపారుదల శాఖ అతిథి గృహంలో చాలీచాలని వసతుల మధ్య తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. ఈ భవనంలో కేవలం మూడు గదులు మాత్రమే ఉండటంతో ఒకటి తహసీల్దార్‌కు కేటాయించగా, మరొక గదిలో డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, ఒక సూపరింటెండెంట్ కూర్చుంటున్నారు. మరో గదిని ఇతర సిబ్బంది కేటాయించారు. దీంతో ఈ మూడు గదులు కూడా ప్రస్తుతం ఉద్యోగులు కూర్చోవడానికి సరిపోవడం లేదు. ఇక కార్యాలయానికి వచ్చే వారు కనీసం నిలుచుందామన్న చోటు ఉండని పరిస్థితి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు కూడా నిర్వహించాల్సి రావడంతో రోజు కార్యాలయం జనాలతో సందడిగా ఉంటుంది. కొత్త భవనం నిర్మాణం అటుంచితే కనీసం విశాలమైన భవనంలోకి అయినా మార్చేందుకు రెవెన్యూ ఉన్నతాధికారులు చొరవ చూపడం లేదు.

నానో మెటీరియల్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

● సదరన్ డెన్మార్క్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వైకె.మిశ్రా



ప్రొఫెసర్ వైకె.మిశ్రాను సత్కరిస్తున్న గీతం అధ్యాపక బృందం

పటాన్‌చెరు రూరల్, జూలై 4 : నానో మెటీరియల్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, వాటిపై విశేష రీతిలో పరిశోధనలు జరుగుతున్నట్టు దక్షిణ డెన్మార్క్ విశ్వవిద్యాలయంలోని స్మార్ట్ మెటీరియల్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ యోగేంద్ర కుమార్ మిశ్రా చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అధునాతన సాంకేతికతల కోసం టెట్రా పోడ్స్ ఆధారిత స్మార్ట్ మెటీరియల్స్ అనే అంశంపై గురువారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. స్మార్ట్ 3డీ నానో మెటీరియల్స్ అభివృద్ధిలో సంక్లిష్ట ఆకారపు నానోస్ట్రక్చర్ల ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. జింక్ ఆక్సైడ్ టెట్రాపోడ్‌లను సంశ్లేషణ చేయడం కోసం జ్వాల ఆధారిత ఒక అడుగు (సింగిల్ స్టెప్) విధానాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు వివిధ సాంకేతిక అనువర్తనాలలో వాటి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. ఈ టెట్రా పోడ్‌లు అనువైన సిరామిక్స్ రూపంలో సూక్ష్మ రంధ్రం గల పరస్పరం అనుసంధానించిన త్రీడీ నానో నెట్‌వర్క్‌లను రూపొందించడానికి అనుకరణాలుగా ఉపకరించడంతో పాటు ఆవిష్కరణలకు కొత్త అవకాశాలను తెరుస్తాయన్నారు. అంతేకాకుండా కార్బన్లు, నైట్రైడ్‌లు, ఆక్సైడ్‌లు, పాలిమర్లు, హైడ్రోజెల్స్ వంటి విస్తృత శ్రేణి పదార్థాలను ఉపయోగించి బోలు టెట్రాపోడల్ 3డీ నెట్‌వర్క్‌ల తయారీకి టెంప్లేట్లుగా ఎలా ఉపయోగపడతామో ప్రొఫెసర్ మిశ్రా ప్రదర్శించారు. ఈ ప్రత్యేకమైన వ్యూహం 3డీ నానో మెటీరియల్ ఇంజనీరింగ్, అధునాతన సాంకేతిక అనువర్తనాల కోసం అద్భుతమైన అవకాశాలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకుల సందేహాలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తొలుత, భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సయన్ చౌధరి అతిథిని పరిచయం చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. భౌతిక, రసాయన శాస్త్రాల విభాగాధిపతులు ప్రొఫెసర్ టి. విశ్వం, డాక్టర్ గౌసియా బేగంలు స్మార్ట్ మెటీరియల్స్ రంగంలో చేసిన విలువైన కృషిని గుర్తిస్తూ ప్రొఫెసర్ మిశ్రాను సత్కరించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● సిద్దిపేట జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్



పేషెంట్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మద్దూరు, జూలై 4: సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పీహెచ్‌సీ సిబ్బందిని హెచ్చరించారు. మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని గదులను పరిశీలించారు. అనంతరం రోగులను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది డ్రెస్‌కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకంపై అసహనం వ్యక్తం చేశారు. యునానీ ఆస్పత్రి సిబ్బంది పనితీరును మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారితో పాటు సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

ఎండోమెంట్ భూములకు పరిహారం ఇప్పించండి

● అంగడికిష్టాపూర్ గ్రామస్థుల విజ్ఞప్తి

● దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విచారణ

మర్కుక్, జూలై 4: ప్రాజెక్ట్ నిర్మాణంలో కోల్పోయిన దేవాదాయ శాఖ భూములకు పరిహారం ఇప్పించాలని అంగడికిష్టాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయానికి 25 ఎకరాల భూమి ఉన్నది. కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి ఆలయానికి సంబంధించిన 3.27 ఎకరాల భూమిని సేకరించారు. పరిహారం ఇప్పటివరకు అందకపోవడంతో గ్రామస్థులు కలెక్టరేట్ దేవాదాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం మారగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలియజేశారు. దీంతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు గ్రామానికి చేరుకొని విచారణ జరిపారు. ఉమామహేశ్వర ఆలయ భూమి హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, తాజా మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్, ఆలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువ నిర్మాణంలో ఆలయ భూములు పోయినందున పట్టా భూములకు ఇచ్చిన విధంగానే పరిహారం చెల్లించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రంగారావు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట ఆలయ ప్రధాన పూజారి వెంకట నర్సయ్యశర్మ, తంబలి వీరేశం, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు



స్విమ్మింగ్ పోటీలకు హాజరైన బాలబాలికలు

సంగారెడ్డి అర్బన్, జూలై 4 : సంగారెడ్డిలోని స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్ర స్థాయి స్విమింగ్ పోటీలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ నెల 13, 14 వ తేదీల్లో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీలో జరిగే 9వ రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ ఈత పోటీల్లో పాల్గొనే బాలబాలికల ఎంపికను చేపట్టారు. కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీహెచ్ఈఎల్ పీఈటీ శశి కుమార్ పర్యవేక్షణలో జరిగిన పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి జావిద్‌అలీ ప్రారంభించారు. ఇందులో భాగంగా అండర్-14 ఫ్రీ స్టైల్‌లో మొదటి స్థానంలో మహ్మద్ అబ్దుల్ రహమాన్, రెండో స్థానంలో మోక్షిత్ నిలిచారు. అండర్-11 మొదటి స్థానంలో ఉజేర్, రెండో స్థానంలో విన్సెంట్, బాలికల ఫ్రీస్టైల్‌లో అలియా ఫాతిమా ప్రతిభ కనబరిచింది. విజేతగా నిలిచిన క్రీడాకారులను జావిద్‌అలీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పవన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గౌతాపూర్ విద్యార్థి ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చిలప్‌చెడ్, జూలై 4: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గౌతాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి అజయ్ ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న అజయ్ లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించినట్లు తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం పొందాడన్నారు. 7వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అజయ్ ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు చెందిన జగదీష్ లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, హరీష్, సాయికిరణ్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం, హారిక 600 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానాలు పొంది బహుమతులను గెలుపొందినట్లు తెలిపారు.

మల్లన్నసాగర్ పర్యాటక కేంద్రం.. అడియాసేనా?



- రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతామని గత ప్రభుత్వం హామీ
- రూ.1500 కోట్లతో పనులు చేస్తామని ప్రకటన
- నెరవేరని హామీ
- ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకునేనా?

తొగుట, జూలై 4 : మల్లన్నసాగర్ పర్యాటక కేంద్రం ఆశలపై నీలినీడలు కమ్ముకున్నాయి. హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్ మల్లన్నసాగర్. దీనిని టూరిజం స్పాట్‌గా మార్చుతామని గత ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పింది. నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పినప్పటికీ ఒక్క పనికూడ ప్రారంభించ లేదు. ప్రస్తుత ప్రభుత్వం దీని ఊసే ఎత్తడం లేదు.

నెరవేరని కేసీఆర్ హామీలు

కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 2022 ఫిబ్రవరి 23న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా మార్చుతామని కేసీఆర్ ప్రకటించారు. అన్నదే తడవుగా ఏడాదిన్నరలో పనులు పూర్తి చేస్తామని హామీల వర్షం గుప్పించారు. కొండపోచమ్మ, అన్నపూర్ణ, బస్వాపూర్, వనదుర్గామాత, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లను టూరిజం స్పాట్‌గా మార్చేందుకు రూ.1500 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 'మల్లన్నసాగర్ రిజర్వాయర్ చుట్టూ నీళ్లు ఉండి మధ్యలో 600 ఎకరాల భూమి ఉందని దానిని ఐలాండ్‌గా మారుస్తామని ప్రకటించారు. ప్రపంచ సినిమావాళ్లు ఇక్కడికి వచ్చి షూటింగ్ జరుపుకునేలా పనులు చేయాలని ఇరిగేషన్ అధికారులను అప్పట్లో ఆదేశించారు. అదే కాకుండా రిజర్వాయర్ చుట్టూ 7,500 ఎకరాల అటవీ భూమి ఉందని అందులో ఔషధ మొక్కలు నాటుతామని ప్రకటించారు. హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ అతిదగ్గరలో ఉందని, రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలోకి రావడం జరుగుతుందని, రాజీవ్ రహదారి నుంచి ఫోర్‌లేన్ దారి, రూ.100 కోట్లతో అద్భుతమైన ఇరిగేషన్ కాంప్లెక్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కలర్ ఫౌంటేన్స్ దుబాయిలోఉండే బురుజు ఖలీఫాను మించి ఇక్కడ ఆవిష్కృతమవ్వాలని, మనం సింగపూర్ పోవడం కాదు... సింగపూర్ నుంచి టూరిస్టులు ఇక్కడకు రావాలి అని కేసీఆర్ అన్నారు. ఏడాదిన్నర లోపల టూరిజం పనులు పూర్తి చేసి తానే వాటిని ప్రారంభిస్తామని ప్రకటించారు. 28 నెలలు కావస్తున్న ఒక్కపని కూడ నేటికి ప్రారంభం కాకపోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా మారింది. అప్పటి సీఎం హామీలలో కేవలం నాలుగు లేన్ల రహదారి పనులు మాత్రం కొనసాగుతున్నాయి.



దృష్టి సారించేనా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ సాగునీటి ప్రాజెక్టులపైనే ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా మార్చితే ఈప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశముంది. ఇటీవల జిల్లాలో హుస్నాబాద్ మండలంలో మహాసముద్రం గండిని పర్యాటక ప్రాంతంగా మార్చుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. గత ప్రభుత్వ హామీ మేరకు మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

మండల పరిషత్‌ల అభివృద్ధికి కృషి

● నిమ్జ్‌తో ఏర్పాటుతో పారిశ్రామిక ప్రగతి

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

ఝరాసంగం, జూలై 4 : మండల పరిషత్‌ల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, వీడ్కోలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత నేత, మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హయాంలో 73, 74 రాజ్యాంగ సవరణ తీసుకువచ్చి జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు పెద్దమొత్తంలో నిధులను కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ నిధులను కుదించడంతో గ్రామాల్లో అభివృద్ధి కుటంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల, లింక్‌రోడ్ల అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. పదవుల్లో ఉన్న సమయాల్లో చేసిన సేవలే తమకు గుర్తింపును తెచ్చిపెడుతాయన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఝరాసంగం, న్యాల్‌కల్ ప్రాంతానికి నిమ్జ్ తీసుకొచ్చామని, మున్ముందు ఈ ప్రాంతమంతా పారిశ్రామికంగా మారి మరింత అభివృద్ధి చెందనుందన్నారు. మరిన్ని పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఎంపీపీ దేవదాస్, జడ్పీటీసీ వినీలా నరేష్, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఎంపీడీవో మండల పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మరింత అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీతోనే మరింత అభివృద్ధి జరుగుతుందని ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. గురువారం ఝరాసంగంలో ఆయనకు ఏర్పాటు చేసిన సన్మానసభ కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ చేస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లనున్నదని చెప్పారు. గతంలో మండలాభివృద్ధికి కృషి చేశానని, ఇకముందు మరింత అభివృద్ధి చేసుకుందామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, వినీలా నరేష్, దేవిదాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ అభివృద్ధికి సహకరిస్తా

● మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, జూలై 4 : క్షత్రియ సమాజ్ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. సోమవంశ సహస్రార్జున క్షత్రియ(పట్కర్)సమాజ్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎస్ఎస్‌కే భవన్‌లో రఘునందన్‌రావుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వాసంతో తనను ఎంపీగా గెలిపించినందుకు రుణపడి ఉంటానన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కోనేరు చందర్, ఉపాధ్యక్షులు చవాన్ సత్యనారాయణ, చవాన్ పురుషోత్తం, సంయుక్త కార్యదర్శి జ్ఞానేశ్వర్, సంతోష్‌కుమార్, కోశాధికారి మల్లేశం, యువ సమాజ్ కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

డీఎస్సీ మూడు నెలలు వాయిదా వేయాలి

● మంత్రి, ఎంపీకి అభ్యర్థుల వినతి

సంగారెడ్డి అర్బన్, జూలై 4 : డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని డీఎస్సీ అభ్యర్థులు గురువారం సంగారెడ్డి మంత్రి దామోదరరాజనర్సింహ్మా, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం లేనందున వాయిదా వేయాలని కోరారు. అంతే కాకుండా గ్రూప్-2,3 పోస్టులు పెంచుతూ గ్రూప్-2 పరీక్షను కూడా వాయిదా వేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అభ్యర్థులు ఆంజనేయులు, అమర్, నరేశ్, నవీన్, మహేశ్, రేణుక, మౌనిక, స్వాతి, సురేఖ, అఖిలేష్, రమేశ్, వినోద్ తదితరులు ఉన్నారు.

భవానీ మందిర్‌లో ఘనంగా లక్షపుష్పార్చన

● వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి సమర్పించేందుకు పూలు తీసుకువస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, జూలై 4: సంగారెడ్డిలోని భవానీ భువనేశ్వరి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో లక్షపుష్పార్చనను గురువారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో మహాపూజ, చండీహోమం జరిపించారు. అమ్మవారి పల్లకీసేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



లక్షపుష్పార్చన అనంతరం భవానీభువనేశ్వరిమాత

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో వేలం ఆదాయం రూ.6,00,500

గుమ్మడిదల, జూలై 4 : బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో వస్తువుల అమ్మకాలు, పార్కింగ్ కోసం గురువారం ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. ఆలయానికి వేలం పాటలో రూ.6,00,500 ఆదాయం వచ్చినట్లు ఈవో శశిధరగుప్తా తెలిపారు. వేలం పాటల్లో పార్కింగ్ రూ.3,20,000 సంజయ్‌కు, అమ్మవారి చీరల వేలం రూ.2,60,000 ఆర్.పోచయ్యకు అమ్మవారి ఒడిబియ్యం రూ.25,000 ఎస్.సంజయ్‌కు దక్కింది. వచ్చిన ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధి కోసం ఖర్చు చేయనున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్, కార్యనిర్వహణాధికారి శశిదర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, మాజీ ధర్మకర్త లక్ష్మీనారాయణ, నాయకులు ప్రతాపరెడ్డి, వినోద్, రమేష్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య పాల్గొన్నారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన

జిన్నారం, జూలై 4: విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ రమేష్ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో మిషన్ శక్తి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలు, శిక్షణ గురించి రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్టోన్ క్రషర్ల అనుమతులు పునరుద్ధరించొద్దు'

జిన్నారం, జూలై 4: మాదారం సర్వే నెంబరు 210లోని స్టోన్ క్రషర్, క్వారీల అనుమతులు పునరుద్ధరించవద్దని మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, గ్రామ నాయకులు కలిసి రామచంద్రాపురం పీసీబీ జోనల్, ఏఈ కార్యాలయాలలో ఫిర్యాదులు అందజేశారు. స్టోన్ క్రషర్ పేలుళ్లతో పర్యావరణం, నీటి వనరులు, వ్యవసాయ రంగాలకు ప్రమాదం కల్గుతుందన్నారు. దుమ్ము, ధూళితో కాలుష్య సమస్య నెలకొందని, గడువు ముగిసిన వాటి లైసెన్స్‌ను పునరుద్దరణ చేయొద్దని కోరారు.


భూములిచ్చిన రైతులకు పొజిషన్లు చూపాలి

జిన్నారం, జూలై 4: జిన్నారం, జంగంపేటలో హెచ్ఎండీఏ లే అవుట్ భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద అందజేసిన స్థలానికి పొజిషన్లు చూపాలని జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ కోరారు. ఈ విషయమై గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఆయన వినతిపత్రం అందజేశారు. భూములు ఇచ్చిన రైతులకు 600 గజాల చొప్పున పట్టాలు అందజేయగా.. నేటికీ పొజిషన్లు చూపలేదని తెలిపారు. ఆదేవిధంగా శివానగర్ 114 సర్వే నెంబరులో టీఎస్ఐఐసీకి ఇచ్చిన భూముల్లో గ్రామ అవసరాల కోసం పది ఎకరాలను కేటాయించగా.. ఆయా భూముల్లో పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేసి అందజేయాలని కోరారు.

నెలాఖరు వరకే గెస్ట్ లెక్చరర్లు.. ఆ తర్వాత?

● పాతవారిని రెన్యువల్ చేస్తూ.. ఇంటర్ బోర్డు ఉత్తర్వులు

● 31 తర్వాత మళ్లీ పొడగిస్తారా?



మెదక్ అర్బన్, జూలై 4 : విద్యాసంవత్సరం మొదలైనా.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల అధ్యాపకుల కొరత ఉండడంతో బోధన సాగడం లేదు. దాంతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని ఇంటర్ విద్యడైరెక్టర్ శృతి ఓజా ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈనెల 31 వరకే ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆ తర్వాత విద్యాసంవత్సరమంతా కొనసాగించే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నా ఆమేరకు ఎందుకు ఉత్తర్వులు వెలువడ లేదనే ప్రశ్న తలెత్తుతుంది.

మెదక్ జిల్లాలో 68 మంది గెస్ట్ లెక్చరర్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అధ్యాపకులు పోస్టులు ఖాళీగా ఉన్న చోట తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్లను 2013 నుంచి ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. వీరికి రోజూ నాలుగు చొప్పున నెలకు 72 తరగతులు ఉండేలా చూస్తూ.. ఒక్కో తరగతికి రూ.390 చొప్పున చెల్లిస్తుంది. ఈ లెక్కన ఒక్కో అధ్యాపకుడు సగటున నెలకు రూ. 28 వేల వేతనం మాత్రమే పొందుతాడు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 16 జూనియర్ కళాశాలల్లో 68 మంది గెస్ట్ లెక్చర్లు, 10 మంది (ఒకేషనల్) కాంట్రాక్ట్ లెక్చరర్లు పాఠాలు బోధిస్తున్నారు. వీరిలో పార్ట్‌టైం, కాంట్రాక్టర్ లెక్చరర్లు ఏటా రెన్యూవల్ అవుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే కళాశాలలకు హాజరవుతున్నారు. అయితే గెస్ట్ లెక్చరర్ల విషయంలో సర్కార్ ప్రతీ ఏడాది ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. అధ్యాపకుల కొరత ఉండడంతో పాత వారిని రెన్యూవల్ చేస్తూ.. గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉత్తర్వుల్లో జూలె 31 వరకే విధులు నిర్వర్తించాలని ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమైన అధికారులను సంప్రదించగా త్వరలోనే విద్యాసంవత్సరం అంతా కొనసాగించేలా ఉత్తర్వులు అందే అవకాశముందని పేర్కొన్నారు. ఏటా విద్యాసంవత్సరం మొదలైన రెండు, మూడు నెలల తర్వాత వారిని రెన్యూవల్ చేసేవారు. ఈ ఏడాది మాత్రం ప్రారంభంలో కొనసాగింపుపై నిర్ణయం తీసుకోవడంతో జూనియర్ కళాశాలల్లో బోధన మరింత సాఫీగా జరగనుంది.

ఆటో రెన్యూవల్‌తో కొనసాగించాలి



2012-13 విద్యాసంవత్సరం నుంచి గెస్ట్ లెక్చరర్లను నియమిస్తూ వస్తోంది. 12 ఏళ్ల నుంచి పని చేస్తున్న మమ్మల్ని ఆటో రెన్యూవల్‌తో కొనసాగించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.48 వేల చొప్పున వేతనం ఇవ్వాలి. పీరియడ్ విధానాన్ని రద్దుచేసి 12 నెలలకు కన్సాలిడేటెట్ పే ఇవ్వాలి.

- బండి కృష్ణ, తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్స్ 2152 అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జూలై 31 వరకు కొనసాగింపు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతేడాది పనిచేసిన గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశించారు. 68 మంది గెస్ట్ లెక్చరర్లు విధుల్లో చేరారు. ఈనెల 31 వరకు కొనసాగింపుపై ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- సత్యనారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి



చేర్యాల: ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మిరుదొడ్డి: ఎంపీటీసీలను సన్మానిస్తున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



దుబ్బాక: దుబ్బాకలో ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి



దౌల్తాబాద్: ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ

ప్రజాసేవకు విరమణ ఉండదు

చేర్యాల, జూలై 4: పదవికి తప్ప ప్రజాసేవకు ఎలాంటి విరమణ ఉండదని, ప్రజాక్షేత్రంలో అనునిత్యం ఉన్న వారి స్థానం ప్రజల మదిలో పదిలంగానే ఉంటుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల, కొమురవెల్లి మండలాల ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో గురువారం కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయం, చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా వారికి శాలుకా కప్పి సత్కరించిన అనంతరం మాట్లాడారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీవోలు కుమారస్వామి, మహబూబ్ అలీ, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● **రాయపోల్:** రాయపోల్ మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అనితా శ్రీనివాస్, జడ్పీటీసీ యాదగిరి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు పర్వేజ్, ఎంపీటీసీలు వెంకటయ్య, ప్రభాకర్, సాయిల్ల లక్ష్మిలను సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో ఎంపీడీవోలు బాలయ్య, స్వర్ణకుమారి, మునయ్య, ఎంపీవోలు లక్ష్మినారాయణ, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

● **కోహెడ:** బీజేపీ ఎంపీటీసీ ఖమ్మం స్వరూప వెంకటేశంను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, మాజీ సర్పంచ్ నవ్య సన్మానించారు. కోహెడ సింగిల్ విండో కార్యాలయంలో ఎంపీటీసీ స్వరూపవెంకటేశం దంపతులకు ఆత్మీయ సన్మానం పేరిట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ముంజ మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ గుగ్గిళ్ల శ్రీనివాస్, నాయకులు బబ్బురు శ్రీనివాస్ ఉన్నారు.

● **మిరుదొడ్డి:** ప్రజాప్రతినిధులుగా ఎంపీటీసీల సేవలు మరువలేనివని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలు, ఎంపీటీసీలు ఉమారాణి, మంజుల తదితరులున్నారు.

● **దుబ్బాక:** పదవీకాలం ముగిసిన దుబ్బాక ఎంపీపీ పుష్పలత, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డితోపాటు 13మంది ఎంపీటీసీలను ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

● **దౌల్తాబాద్:** ప్రజలకు సేవచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపీపీ గంగాదరి సంధ్య రవీందర్, జడ్పీటీసీ రణంజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఎంపీటీసీల వీడ్కోలు సమావేశాన్ని ఎంపీడీవో వెంటకలక్ష్మిమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుజాత, ఎంపీవో ఘఫూర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రహీమొద్దీన్, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



రాయపోల్: మండల పరిషత్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీడీవో



కోహెడ: ఎంపీటీసీలను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు



తొగుట: ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న కో ఆపరేటివ్ చైర్మన్ హరికృష్ణారెడ్డి

పోటాపోటీగా సన్మానాలు

తొగుట, జూలై 4: మండల కేంద్రమైన తొగుటలో గురువారం నిర్వహించిన మాజీ ప్రజా ప్రతినిధుల వీడ్కోలు సమావేశం పోటాపోటీగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మాన నిర్వహించగా, తొగుట కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సన్మానం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమానికి అధికారులు వంత పాడడం గమనార్హం. పదవీకాలం ముగిసినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమాలు అధికారికంగా ఆయా పార్టీ నేతలు నిర్వహించడం పలు విమర్శలకు తావిస్తున్నది. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి పాల్గొనగా, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి నేతృత్వం వహించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీపీ ప్రజలకు చేసిందేమి లేదు

మిరుదొడ్డి, జూలై4: ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తామని చెప్పి ఎంపీపీ గజ్జల సాయిలు ఇనాళ్లు పబ్బం గడుపుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమి లేదని ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజు మండిపడ్డారు. గురువారం మిరుదొడ్డిలో జరిగిన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనానికి కొందరు ఎంపీటీసీలు హాజరు కాలేదు. వారం క్రితం ఎంపీటీసీలకు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధులను కేటాయిస్తామని చెప్పి ఎంపీటీసీ సభ్యులతో సంతకాలు తీసుకుని నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మి, ఎంపీటీసీలు తదితరులున్నారు.

పది ఎకరాలలోపు రైతులకు భరోసా అందించాలి

● సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి



మాట్లాడుతున్న హరికృష్ణారెడ్డి

తొగుట, జూలై4: పది ఎకరాలలోపు పంట సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని కాన్గల్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి కోరారు. తొగుట రైతు వేదికలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రైతు భరోసా పేరుతో అందించే సహకారం వల్ల చిన్న, సన్న కారు రైతులకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఆడిట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, మండల వ్యవసాయ అధికారి మోహన్, సీఈవో గంగారెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' పై అభిప్రాయ సేకరణ

జగదేవ్‌పూర్, జూలై 4: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం జగదేవ్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన రైతు భరోసా, రైతు పథకాలపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతగానో ఉపయోగపడే పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ నాగభూషణం, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు, కార్యాలయ సీఈవో రాములు, సిబ్బంది సత్యనారాయణరెడ్డి, సందీప్‌రెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసును ఎత్తివేయాలి'

హుస్నాబాద్, జూలై 4: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ప్రభుత్వం పెట్టిన కేసును ఎత్తివేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడే నాయకుల గొంతులను ప్రభుత్వం నొక్కుతుందన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదనేది గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలపై కక్ష్య సాధింపు చర్యలను మానుకోవాలన్నారు.

'ఆటలతో చెడు వ్యసనాలు దూరం'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

మర్కుక్, జూలై 4: ఆటలు ఆడడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండటమే కాకుండా మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం అన్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లిలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పాములపర్తి కరుణాకర్, మర్కుక్ మండల స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ రాజు, కృష్ణ, క్లబ్ సభ్యులు శేఖర్, కరుణాకర్, జగదీశ్, స్వామి, ప్రశాంత్, శ్రీకాంత్, కనకరాజు, శ్రీను, సందీప్, పాండ్య పరమేశ్ తదితరులు ఉన్నారు.

క్రీడాభివృద్ధికి తోడ్పాటు

గజ్వేల్, జూలై 4: క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని వర్గల్ మండలం చౌదరిపల్లి మాజీ ఉప సర్పంచ్, ఆర్ఎంపీ వైద్యుడు పొద్దుటూరి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలోని వాలీబాల్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారుడు చిగుర్లపల్లి సృజన్‌కుమార్‌యాదవ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పాండిచ్చేరిలో స్పోర్ట్స్ హాస్టల్‌లో శిక్షణ పొందుటకు ఎంపికవగా, అతడికి వాలీబాల్ కిట్, షూస్ ఇతరత్రా సామగ్రిని అందజేశారు. వారికి వాలీబాల్ నేషనల్ క్రీడాకారుడు, కానిస్టేబుల్ సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపాడు.

మర్పడగ మల్లికార్జునుడికి అన్నాభిషేకం

కొండపాక, జూలై 4: మండలంలోని మర్పడగ శ్రీవిజయదుర్గాసమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా సంతానమల్లికార్జునస్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆరున్నర గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు సంతాన మల్లికార్జునస్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యాశతకం పుస్తకావిష్కరణ

గజ్వేల్, జూలై 4: గజ్వేల్ పట్టణంలోని జీడీఆర్ హైస్కూల్‌లో నేడు విద్యాశతకం పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎజాస్ అహ్మద్ తెలిపారు. హాస్యబ్రహ్మ శంకరనారాయణ రచించిన విద్యా శతకం పుస్తకావిష్కరణతో పాటు రాయారావు విశ్వేశ్వరరావు స్వరకల్పన చేసిన కైలాసగిరివాస పాట ఆవిష్కరణ ఉదయం 11.15గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, అతిథులుగా తబలా విద్వాంసుడు దేశపతి శ్రీనివాస్‌శర్మ, రాయారావు విశ్వేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయురాలు మంజుల హాజరవుతున్నట్లు తెలిపారు.



దూళిమిట్ట మండలకేంద్రం నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం పాత బస్టాండ్ సమీపంలో బురదలో దిగబడింది. మిషన్ భగీరథ పైపుల నుంచి నీరు లీకై ఆ ప్రాంతం బురదమయంగా మారింది. ఇప్పటికే పైపులైన్ 10సార్లు లీకేజీ అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

\- దూళిమిట్ట

మినరల్ వాటర్‌ప్లాంట్ కమిటీ ఎన్నిక

హుస్నాబాద్‌రూరల్,జూలై4: మండలంలోని తోటపల్లిలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే మినరల్ వాటర్‌ప్లాంట్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బంక లక్ష్మి. కమిటీ సభ్యులుగా మానుక కుమార్, బోనాల కుమార్, దొంతరవేని నరేష్, పోచవేని రాధిక, బంక సారవ్వ, కనుకవ్వ, గాదాసు సరస్వతి, ఆవుల సుమలత ఎన్నికైనట్లు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

దూళిమిట/చేర్యాల, జూలై4: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన మండల కేంద్రానికి చెందిన ఇద్దరు చిన్నారులు శివ, శశిల కుటుంబసభ్యులను గురువారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ పరామర్శించి రూ. 5000 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రితేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ సుద్దాల రేణుక నర్సింహులు, తుషాల పురం రాజు, తదితరులు ఉన్నారు.

చేర్యాల పట్టణానికి చెందిన సామల సురేందర్ (45) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అతడి చిన్ననాటి స్నేహితులు అతడి కుటుంబానికి రూ.53వేల నగదును గురువారం అందజేశారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

నారాయణరావుపేట, జూలై4: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెగిగేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల సంఖ్య గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యాక్రమంలో మండల విద్యాధికారి యాదవరెడ్డి, ప్రధానోపాధ్యయుడు నాగరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

● డీడబ్ల్యూవో శారద, సీడీపీవో రమాదేవి



మాట్లాడుతున్న శారద, రమాదేవి

సిద్దిపేట అర్బన్/ చేర్యాల జూలై 4: పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఎదుగుదల పెరిగే అవకాశం ఉంటుందని డీడబ్ల్యూవో శారద, సీడీపీవో రమాదేవి పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో గురువారం 'గ్రోత్ మేళా' కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థుల ఎదుగుదల, ఆరోగ్యం విషయాలను తెలుసుకున్నారు. అనంతరం టీచర్లకు తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉదయ్ కుమార్, సూపర్‌వైజర్ స్వరూప, పోషన్ అభియాన్ శ్రీనివాస్, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, సీఏ అనిత, స్వప్న, అంగన్‌వాడీ టీచర్ పద్మ, కళావతి, విజయలక్ష్మి, ఆయా శంకరమ్మ, నరసవ్వ, ఆశా వర్కర్స్ రజిని, శకుంతల తదితరులు పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలు-1,3,6,11 ఆధ్వర్యంలో గురువారం స్థానిక కురుమవీధి పాఠశాలలో గ్రోత్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి హాజరై చిన్నారుల ఎత్తు,బరువుల కొలతలు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'వరిలో కాలిబాటలతో ప్రయోజనం'

నారాయణరావుపేట,జూలై04: వరిలో కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి వెంకట రమణి తెలిపారు. నారాయణరావుపేట మండల లక్ష్మీదేవిపల్లిలో గురువారం మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. వరిలో ప్రతి 20 సెం.మీటర్ల మేర కాలిబాటలు వదులాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో నాగర్జున్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

గజ్వేల్, జూలై 4: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థికశాస్త్ర అధ్యాపకుడు ఎదునూరి రామచంద్రానికి ఉస్మానియా యూనివర్సిటీ గురువారం డాక్టరేట్ ప్రదానం చేసిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరావు తెలిపారు. కళాశాల బృందం ఆధ్వర్యంలో రామచంద్రాకి అభినందనలు తెలిపారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

● వర్ధంతిలో నాయకులు



సిద్దిపేట అర్బన్: దొడ్డి కొమరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట అర్బన్, జూలై 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, అరుణ్‌కుమార్, శిరీష, ప్రశాంత్, నాయకులు సంజీవ్, నారాయణ, అభి పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దొడ్డి కొమురయ్య చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట కురుమ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు బింగి స్వామి, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు నరేందర్‌రెడ్డి, అయ్యలం, తుప్పతి అంజయ్య, రాములు, బాగమ్మోళ్ల మల్లేశం, కడారి నరేందర్, రమేశ్‌గౌడ్, మహంకాళీ నరేందర్, బొమ్మ కుమార్, కర్రోళ్ల యాదగిరి, అనిల్, శ్రీహరి, నాయకులు ఉన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్లలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి గ్రామ మాజీ ఎంపీటీసీ, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు తుప్పతి అంజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనవెంట గ్రామ కురుమ సంఘం నాయకులు ఉన్నారు.

● **చేర్యాల:** స్థానిక అంగడిబజారు చౌరస్తాలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ చెవిటి లింగం, ఒగ్గు రాజు, కురుమసంఘం రాష్ట్ర నాయకుడు అందె అశోక్, కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి మీస సత్యనారాయణ, నాయకులు అందె నాని, కామల్ల అనిల్‌కుమార్, జంగిలి యాదగిరి, ఈరి భూమయ్య, బండారి కనకయ్య, కోరే శ్రీశైలం, బండారి సిద్దులు, బండారి అంజయ్య, ఎగుర్ల ఎల్లయ్య పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



గజ్వేల్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

● **నంగునూరు:** మండలంలోని సిద్దన్నపేట స్టేజి వద్ద ఎంపీటీసీ, కురుమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బెదురు తిరుపతి ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు నకిర్త ఎల్లయ్య, నకిర్త రాజమల్లు, కొలుపుల ఆంజనేయులు, నర్సింహులు, కొన్నే సంపత్, బెదురు కైలాస్, కడవ అజయ్, ఎట్ల రాజు, బెదురు వర్షిత్ పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి కురుమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు చెంచు సంపత్, వీర్ల లింగయ్య, మ్యాకల ఓదయ్య, పెద్ది ఓదయ్య, శ్రీనివాస్, రమేశ్, బీరయ్య, రంజీత్ తదితరులున్నారు. పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు సంజీవరెడ్డి, మల్లారెడ్డి, కొమురయ్య, నవ్య, సుదర్శనచారి తదితరులున్నారు.

హామీలను నెరవేర్చాలి

● బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేష్‌రెడ్డి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకురాళ్లు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, జూలై 4: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట ఆర్డీవోకు గురువారం వినతిపత్రం అందజేసి ఆమె మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి, రోజుకో కొత్త కథ చెప్తూ కాలం వెళ్లదీస్తున్నందని విమర్శించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు పద్మ, లక్ష్మి, విజయ, వినోద, కుంకుమ రాణి, నాగజ్యోతి, మమత, సరిత ,కల్యాణి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్వీ గజ్వేల్ టౌన్ నాయకులు నవాజ్ ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరపాలి

● కాంగ్రెస్ గజ్వేల్ యూత్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి



సిద్దిపేట అర్బన్: బంద్ సందర్భంగా మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

ములుగు, జూలై 4: ఎన్ఎస్‌యూఐ పిలుపు మేరకు గజ్వేల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ నాయకుడు చింతకింది రాజులు, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు వేణు, ములుగు గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండ నర్సింహులు, శంకర్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, ఎరుకల శ్రీను, నవీన్, తిగుళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట అర్బన్:** విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని వివిధ విద్యార్థి యువజన సంఘాల నాయకులు తెలిపారు. ప్రభుత్వ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్, ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిలు జేరిపోతుల జనార్దన్, దాసరి ప్రశాంత్, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అజ్మత్, ఏఐవైఎఫ్, పీవైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు శంకర్, అనిల్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐపీఎస్‌యూ జిల్లా నాయకులు సంగెం మధు రామగల్ల నరేష్, ప్రసన్నకుమార్, కొండం సంజీవ్, నగేష్, కృష్ణ,అభి, నవదీప్, సమ్మయ్య, యాదగిరి, సాగర్, అనిరుద్, శ్రవణ్, శ్రీను,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యా సంస్థలను మూసి వేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బొమ్మిడి సాయి, ఎస్ఎఫ్ఐ నాయకులు హరీశ్, మహేష్, శ్రీకాంత్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● **కోహెడ:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, జూనియర్ కాలేజీలు ఆదర్శ పాఠశాల విద్యార్థులను విద్యార్థి సంఘాల నాయకులు బయటకు పంపి మూసి వేయించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రంజిత్‌రెడ్డి, దినేశ్, అంజి, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలో అన్ని పాఠశాలలను ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మూసి వేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎర్రబోయిన త్రినేష్‌యాదవ్, కొండపాక మండల సోషల్‌మీడియా కో ఆర్డినేటర్ మెరుగు ప్రభాస్, నరేష్, పెరుగు రాకేష్, మహేష్ సంజు, పెరుగు మహేందర్, పెరుగు అజయ్, అమ్ముల రాకేష్ తదితరులు పాల్గొన్నారు

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంతో పాటు మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కోనేరు ప్రవీణ్, నాచారం శేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రణయ్ నాయకులు శేఖర్, లోకేష్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు సరార్‌ఖాన్, సమీర్, సొక్కం సురేశ్ తెలిపారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బిచ్చాల శ్రీనివాస్, అభిలాష్ అంకిత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సనత్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిలాష్, అంకిత్‌లున్నారు.

● **చేర్యాల:** విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో విజయవంతమైంది. ప్రైవేటు పాఠశాలలు ముందస్తు బందు ప్రకటించగా, ప్రభుత్వ పాఠశాలలు యధావిధిగా కొనసాగిన తరగతులను ఆయా యూనియన్ నాయకులు బహిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకి: ప్రభుత్వ పాఠశాలను మూసివేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



కోహెడ: మండలంలోని శనిగరం ఉన్నత పాఠశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



గజ్వేల్: మండలంలోని ప్రజ్ఞాపూర్‌లో పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు



ములుగు: స్కూల్ బంద్ చేయిస్తున్న నాయకులు